వచ్చే ఎన్నికల్లో తొలి విజయానికి అనకాపల్లి నుంచి నాంది పలకాలి

మంత్రి అమర్నాథ్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్ర వ్యాప్తంగా 26వ తేదీ నుంచి ప్రారంభమైన తొలి విడత సామాజిక న్యాయ బస్సు యాత్ర నవంబర్ 9వ తేదీన అనకాపల్లి నియోజకవర్గంలో ముగియనుందని, ఆరోజు అనకాపల్లిలో నిర్వహించనున్న బహిరంగ సభ వచ్చే ఎన్నికలకు శంఖారావం కావాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ అన్నారు. అనకాపల్లి నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ బస్సు యాత్ర కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మంగా తీసుకున్నారని చెప్పారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి 175 నియోజకవర్గాల్లో బస్సు యాత్ర పూర్తి కావాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు చెప్పారు. 9వ తేదీ మధ్యాహ్నం రెండున్నర గంటలకు బస్సు యాత్ర అనకాపల్లికి చేరుకుంటుందని, మూడు గంటలకు సభా ప్రాంగణానికి వస్తుందని అని చెప్పారు. ఈ సభలో ఉత్తరాంధ్రకు చెందిన మంత్రులు, ముఖ్య నాయకులు, కోఆర్డినేటర్లు ఈ సభలో పాల్గొంటారని అమర్నాథ్ వివరించారు. అలాగే వచ్చే నెల ఒకటి, రెండు తేదీలలో గ్రామాల వారీగా పార్టీ నాయకులతో తను సమావేశం నిర్వహిస్తానని అమర్నాథ్ వెల్లడించారు. ఇదిలా ఉండగా గృహ సారథుల ఇన్సూరెన్స్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మంత్రి అమర్నాథ్ నాయకులను ఆదేశించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని వైసిపి నినాదంగా మార్చుకుని ముందుకు వెళుతుందని అన్నారు. గత ప్రభుత్వాలేవి ఇవ్వని విధంగా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అందజేస్తుందని చెప్పారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ కార్పొరేషన్ చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, అనకాపల్లి పట్టణ వైసిపి అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు పాల్గొన్నారు.

ఘనంగా కామ్రేడ్ దేముడు వర్ధంతి

విశాలాంధ్ర - నర్సీపట్నం: నర్సీపట్నం బ్యాంక్ కాలనీ వద్ద కామ్రేడ్ గొడ్డేటి దేముడు 8వ వర్ధంతి పురస్కరించుకొని సీపీఐ జిల్లా సమితి సభ్యులందరూ ఘనంగా విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అనకాపల్లి జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ మాట్లాడుతూ కామ్రేడ్ గొడ్డేటి దేముడు మాజీ శాసనసభ్యులు ప్రజాదరణ పొందిన మనిషి అన్నారు. సీపీఐ పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి మంత్రాలకు చింతకాయలు రాలవని అనే సామెతగా ఎన్ని మాయమాటలు చెప్పినా చివరి క్షణం వరకు సీపీఐ పార్టీ ముద్దుబిడ్డగా ఆయిన నిజాయితీని చాటుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మాకిరెడ్డి రామునాయుడు, రాజాన దొరబాబు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లు గురుబాబు, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జున్‌రావు, గౌరవాధ్యక్షులు శివలంక కొండలరావు, జోగిరాజు, శ్రీరామ్మూర్తి, ఏ.ఐ.ఎస్.ఎఫ్. అనకాపల్లి జిల్లా కార్యదర్శి, జాతీయ సమితి సభ్యులు జి.ఫణీంద్ర, శ్రీరంగం రాంబాబు, పావాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

8న విద్యాసంస్థల బంద్: ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్

విశాలాంధ్ర - విశాఖ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు నవంబర్ 8వ తేదీ నాటికి వెయ్యి రోజులు పూర్త వుతున్న సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 8న రాష్ట్ర వ్యాప్తంగా కేజీ నుండి పీజీ వరకు విద్యాసంస్థలు బంద్ తలపెట్టినట్టు ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ఉల్లం నాగరాజు, ఏఐవైఎఫ్ కార్యదర్శి వై.రాంబాబు తెలిపారు. అల్లిపురంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో వారు మాట్లాడారు. అలాగే కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడం రాష్ట్ర ప్రజల బాధ్యత అని అన్నారు. బంద్‌కి రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు అచ్యుతరావు, పీడీఎస్‌యూ నాయకురాలు అఖిశ్రీ, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రతనకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శేఖర్, జీవన్, మనీ, ఏఐవైఎఫ్ నాయకులు సాయి పాల్గొన్నారు.

బి.ఎన్. రోడ్డు మరమ్మత్తులు పూర్తి చేయాలి: సీపీఐ

విశాలాంధ్ర - చోడవరం: అనకాపల్లి జిల్లా చోడవరం నుండి నర్సీపట్నం వెళ్ళు ఆర్ అండ్ బి రోడ్ మరమ్మత్తు పనులు తక్షణమే పూర్తి చేసి రోడ్లు వేసి, ప్రమాదాలను అరికట్టాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు డిమాండ్ చేశారు. రెడ్డిపల్లి గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రధాన రహదారుల్లో గోతులతోపాటు, మరమ్మతుల కోసం తీసిన గోతుల్లో తరచూ పడిపోతున్న వాహనదారులు, ప్రయాణికులు పలుమార్లు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. పాడుబడిన రహదారుల్లో ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యుడు, ప్రభుత్వ ఉన్నతాధికారులు రహదారులను తక్షణమే బాగు చేసే చర్యలు చేపట్టాలన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి నిత్య కల్యాణం నేత్రపర్వంగా సాగింది. ఆర్జిత సేవల్లో భాగంగా సింహాద్రి అప్పన్న నిత్యకల్యాణం ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. అర్చకస్వాములు నిత్యకళ్యాణంలో భక్తుల, గోత్రనామాలతో సంకల్పం నిర్వహించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

వరిలో చీడ పీడల నివారణకు చర్యలు

విశాలాంధ్ర - కె.కోటపాడు: వరి పొలాలలో సుడి దోమ, ఆకు ముడత పురుగు ఉధృతిని రైతులు సకాలంలో నివారించుకోవాలని మండల వ్యవసాయాధికారి సోమ శేఖర్ రైతులకు సూచించారు. సుడి దోమ నివారణకు పైమెట్రిజోల్ అనే మందును ఎకరానికి 120 నుంచి 160 గ్రాముల వరకు వాడవచ్చని అన్నారు. అలాగే ఆకు ముడతకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 % స్పెషల్ పొడి మందును ఎకరానికి 500 గ్రాములు లేదా ఎసిఫేట్ అనే మందును 500 గ్రాములు కానీ పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు లెక్కల ముత్యాల నాయుడు, యడ్ల వెంకీ నాయుడు, పాటూరు వెంకటరావు, వ్యవసాయ గ్రామా సహాయకులు పూజిత, విజయ్ పాల్గొన్నారు.

జల జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయండి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: జల జీవన్ మిషన్ క్రింద చేపట్టిన వివిధ త్రాగునీటి పథకాల పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి నిర్వహించిన హైబ్రిడ్ సమావేశంలో ప్రభుత్వ ఉత్తర్వులు 56, 8181, 918 క్రింద మంజూరైన వివిధ పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐదు లక్షల రూపాయల లోపు, ఐదు లక్షల రూపాయలు పైబడి పనులు మంజూరయ్యాయని వాటిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ హైబ్రిడ్ సమావేశంలో పాడేరు నుండి జలజీవన్ మిషన్ కార్యనిర్వాహక ఇంజనీర్ లీలా కృష్ణ, పాడేరు డివిజన్ 11 మండలాల సహాయ ఇంజనీర్లు పాల్గొనగా మిగిలిన 11 మండలాల సహాయ ఇంజనీర్లు, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి చైతన్య వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

చురుగ్గా బస్ షెల్టర్ నిర్మాణ పనులు

విశాలాంధ్ర - ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో గల నాలుగు రోడ్ల కూడలి వద్ద బస్ షెల్టర్ నిర్మాణం కోసం జిల్లా పరిషత్ సుమారు 5 లక్షల రూపాయల నిధులతో ప్రయాణికులు వేచివుండే సౌకర్యార్థం బస్ షెల్టర్ పనులు చురుగ్గా కొన సాగుతుంది. పాడేరు విశాఖపట్నం అనకాపల్లి వైపు వెళ్లే ప్రయా ణికులు నాలుగు కూడలి వద్ద వర్షానికి, ఎండకి, చలికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో బస్ షెల్టర్ విషయమై స్థానిక వైసీపీ నేతలు జిల్లా పరిషత్ చైర్పర్సన్ అరబీరు సుభద్ర దృష్టికి తీసుకుని వెళ్ళగా స్పందించిన జిల్లా పరిషత్ చైర్పర్సన్ సుభద్ర జిల్లా పరిషత్ విధులు 5 లక్షలు మంజూరు చేశారు. బస్ షెల్టర్ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదోడి ఆరోగ్యానికి భరోసా

విశాలాంధ్ర - డుంబ్రిగూడ: జగనన్న ఆరోగ్య సురక్ష పేదోడి ఆరోగ్యానికి భరోసాగా నిలిచిందని స్థానిక ఎంపీపీ బి.ఈశ్వరి, జెడ్పీటీసీ సిహెచ్.జానకమ్మలు చెప్పారు. మండలంలోని కంద్రుం పంచాయతీ కేంద్రంలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. నిరుపేద కుటుంబాలకు జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ఎంతో దోహదపడుతుందని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆనందరావు, వైద్యాధికారి రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు మల్లేశ్వరరావు, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు హరి, మాజీ సర్పంచ్ ఆనంద్‌రావు, వైసీపీ సీనియర్ నాయకులు సింహాచలం, బాక సింహాచలం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వి.మాడుగుల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని మాడుగుల ఎంపిపి పెదబాబు అన్నారు. గురువారం మాడుగుల జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రాజారాం, తహశీల్దార్ పివి.రత్నం, సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ శ్రీనాధు శ్రీనివాసరావు, ఎంపిటిసి కుక్కర మహేశ్వరి, వైసిపి పట్టణ అధ్యక్షులు బమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

దిబ్బవలసలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర - అరకులోయ: సిరగం పంచాయతీ దిబ్బవలస గ్రామంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. సెంట్రల్ ఫర్ వరల్డ్ షో లిడాల్టీ సంస్థ ఆధ్వర్యంలో మండల కమ్యూనిటీ మొబలైసర్ కురదాబోయిన జీన బంధు పర్యవేక్షణలో జరిగిన ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో సుమారు 100 మందికి పైగా వివిధ గిరిజన గ్రామాల నుండి హాజరై వైద్య పరీక్షలు జరిపించుకున్నారు. ఈ వైద్య పరీక్షలలో 12 మందికి ఆపరేషన్ అవసరం కావడంతో వారిని విశాఖకు పంపించి ఉచితంగా ఆపరేషన్లు చేయించి కంటి అద్దాలు పంపిణీ చేసి ఉచిత భోజన వసతి సౌకర్యం కల్పించి వారిని తిరిగి సకల సౌకర్యాలతో గ్రామాలకు చేర్చడానికి సెంట్రల్ ఫర్ వరల్డ్ సోలిడాల్టీ సంస్థ ఏర్పాట్లు చేస్తుంది. ఉచిత కంటి వైద్య శిబిరంలో ఆప్టోమెట్రిస్ట్ లు సీతారాం , శ్రీయాన్ని వాత్సల్య,



నేత్ర సమస్యలతో బాధపడుతున్న వారిని క్షుణ్ణంగా పరీక్షించి వారికి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో ఫీల్డ్ ఎక్స్టెన్షన్ ప్రతినిధి బురిడి బుద్ర, సి డబ్ల్యూ ఎస్ వాలంటీర్ వంతల డేవిడ్, టీం కోఆర్డినేటర్ ఆర్ స్వాములు, ఫీల్డ్ ఆఫీసర్ సత్యనారాయణ, గ్రామ పెద్దలు మాజీ వార్డ్ మెంబర్ గెమ్మెలి బాలరాజు, బురిడి సుబ్బారావు, సోడాపల్లి రమేష్ తదితరులు పాల్గొని ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం కావడానికి విశేష కృషి జరిపారు.

నవరత్నాల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను చేర్చాలి

విశాలాంధ్ర - మల్కాపురం: నవరత్నాల్లో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌ను చేర్చాలని దళిత హక్కుల పోరాట సమితి విశాఖ జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రాంతం పరిధి 63వ వార్డులో గల కాకరలోవ గ్రామంలో నరసన చేపట్టారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఇందిరాపార్క్ వద్ద రాష్ట్రంలో ఉన్న దళిత సంఘాలన్నీ నిరాహార దీక్షలు చేయడం వల్ల ఎస్సీ, ఎస్టీలను సాధించుకున్నామన్నారు. 28 సంక్షేమ పథకాలను మరలా పునర్నిర్మాణం చేపట్టాలని వైయ స్సార్ ప్రభుత్వాన్ని అన్నారు. కార్య క్రమంలో మల్కాపురం ఏరియా అధ్యక్షులు కామేశ్వరరావు, కమిటీ సభ్యులు కనకరాజు, బి.వెంకట్, గాలి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కెమికల్ ఫ్యాక్టరీని మూసివేయాలి

విశాలాంధ్ర - కశింకోట: క్రబ్స్ బయో కెమికల్ ఫ్యాక్టరీ వలన గ్రామాలలో ఎవరైనా బోర్ తీసుకుంటే కలుషిత మంచినీరు వస్తుందని ఫ్యాక్టరీ చుట్టుపక్కల గ్రామాలైన గంటవారిపాలెం, పేరంటాలపాలెం కొత్తపల్లి తేగాడ గ్రామస్తులు ఫ్యాక్టరీ ఆవరణలో ధర్నా నిర్వహించారు. గతంలో తీసిన బోరు బావుల్లో కలుషిత వాటర్ వస్తుందని సమస్యలు పరిష్కరించాలని బుధవారం రాత్రి నుండి కంపెనీ గేట్ ముందు గ్రామస్తులు ధర్నా చేశారు. గత కొంతకాలంగా చుట్టుపక్కల గ్రామాల్లో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం అవ్వట్లేదని అన్నారు. గురువారం కంపెనీ ముందు సుమారు 100 మందితో ధర్నా కార్యక్రమం చేపట్టారు. సుమారు 20 సంవత్సరాల నుండి సమస్యను పరిష్కారం చేయకుండా తాత్సారం చేస్తున్నారన్నారు. అలాగే క్లబ్స్ మేనేజర్ మల్లికార్జునరావును వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆందోళన జరుగుతున్న విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, సంఘటన స్థలానికి వచ్చి ఎటువంటి సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

నైపుణ్యాలు గల వారికే ఉద్యోగ అవకాశాలు

విశాలాంధ్ర - మధురవాడ: కోవిడ్‌తో పాటు ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక రంగం, ఉక్రేన్-రష్యా యుద్ధం తదితర పరిణామాల నేపథ్యంలో వివిధ కంపెనీల నియామకపు ప్రక్రియలో గణనీయమైన మార్పులు వచ్చాయని ముఖ్యంగా నైపుణ్యాలు గల వారికి మాత్రమే ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని వివిధ పరిశ్రమల నిపుణులు పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం కెరీర్ గైడెన్స్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమాన్ని గీతం వైస్ ఛాన్స్లర్ ప్రొఫెసర్ దయానంద సిద్దవట్టం ప్రారంభించారు. పరిశ్రమలకు విద్యాలయాలతో మెరుగైన సంబంధాల ద్వారా కాలానుగుణంగా సిలబస్‌లలో మార్పులు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో శాప్ ల్యాబ్స్ డైరక్టర్ కమల్ స్టీఫెన్, గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ సిహెచ్ విజయశేఖర్, ఐబిఎమ్ లోకల్ హెడ్ ఎ.అనురాధ, కాగ్నిజెంట్ సీనియర్ డైరెక్టర్ సి.సుబ్రహ్మణ్యం, ఇన్‌టెల్ బిజినెస్ మేనేజర్ హెచ్.గిరీష్, బ్రాండిక్స్ టేలంట్ మేనేజ్‌మెంట్ హెడ్ డాక్టర్ షెహజాది, అమర్‌రాజా గ్రూప్ బిజినెస్ హెచ్ఆర్ రవికుమార్, సిలికాన్ ల్యాబ్స్ సీనియర్ మేనేజర్ జాక్సన్ జాన్సన్, ఆల్‌స్టామ్ డైరక్టర్ ఎ.శ్రీనివాస్, గీతం జిసిజిసి డీన్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ వద్ద రోడ్డు ప్రమాదం: ఉద్యోగి మృతి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: స్టీల్ ప్లాంట్ స్టీల్ మెల్టాప్ (ఎస్ఎంఎస్) విభాగం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఉద్యోగి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి స్టీల్ ప్లాంట్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు వడ్లపూడి నిర్వాసిత కాలనీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన ప్రాంతానికి చెందిన కరణం కనక అప్పారావు (51) ఎస్ఎంఎస్ విభాగంలో జనరల్ ఫోర్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం విధి నిర్వహణలో భాగంగా మధ్యాహ్నం కొన్ని సామాన్లు కోసం విభాగంలోని పై అంతస్తు నుంచి కిందకు వచ్చి సామాగ్రిని ఓ వాహనంలోకి ఎక్కించాడు. తరువాత పని ప్రదేశంకు వెళ్లే క్రమంలో ఓ భారీ ట్రాలర్ మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో డ్రైవర్ వేగాన్ని అదుపు చేయలేకపోవటంతో అప్పారావుపైకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో అప్పారావు సంఘటన స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న స్టీల్‌ప్లాంట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకొని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. కనక అప్పారావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. దీనిపై స్టీల్ ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

జనసేన ఇన్‌చార్జ్ సందీప్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - ఆనందపురం: భీమిలి జనసేన పార్టీ ఇన్‌చార్జ్ డాక్టర్ సందీప్ పంచకర్ల జన్మదిన వేడుకలు గురువారం కింగ్స్ ఫంక్షన్లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జనసేన నాయకులతో పాటు టిడిపి ముఖ్య నాయకులు హాజరయ్యారు. తన పుట్టిన రోజు సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సందీప్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడే తత్వం అలాగే రానున్నది జనసేన టిడిపి ఉమ్మడి ప్రభుత్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శాకరి శ్రీనుబాబు, చంద్రరావు, మండల పార్టీ అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు, మజ్జి శ్రీను, జనరల్ సెక్రటరీ మూర్తి, ఉపాధ్యక్షులు శివకృష్ణ, బాలు, కార్యదర్శులు డాక్టర్ విన్నింటి సన్యాసిరావు, బోద్దాపు గోవిందు, బంగారు నాయుడు, నర్సింగరావు, తదితర కమిటీ సభ్యులు నాయకులు వీర మహిళలు, జనసేన పార్టీ కార్యకర్తలు, టీడీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

విశాలాంధ్ర - నర్సీపట్నం: అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జున్ రావు, ప్రధాన కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడులు అన్నారు. మండలంలోని పెదబొడ్డేపల్లి గ్రామ సచివాలయం వద్ద సీపీఐ అనుబంధ సంఘమైన ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి సిబ్బందికి వినతి అందించారు. ఉత్తరాంధ్ర జిల్లాలలో అత్యంత దారుణంగా కరువు ఛాయలు ఏర్పడ్డాయని అన్నారు. కరువు నుండి పేదలను, వ్యవసాయ కూలీలను, రైతులను విముక్తి చేసి వలసలు ఆపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రధానంగా వ్యవసాయ పనులు లేక గ్రామాలకు గ్రామాలే ఖాళీ అవుతున్నాయన్నారు. వ్యవసాయ కూలీలు, పేద కుటుంబాలకు నెలకు 10 వేల రూపాయలు కరువు పెన్షన్‌తో పాటు నెల నెలా 35 కేజీల బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు ఉచితంగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు గొల్లు గురుబాబు, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, మాకిరెడ్డి రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

జల వనరుల నిర్వహణపై అంతర్జాతీయ సదస్సు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఎదురయ్యే సవాళ్లకు పరిష్కార మార్గాలు, సాగునీటి కొరత లేని విధానాల రూపకల్పన, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా జల వనరుల నిర్వహణ తదితర అంశాలపై విశాఖపట్టణంలోని ర్యాడిసన్ బ్లూ హెూటల్ వేదికగా అంతర్జాతీయ సదస్సు జరగనుందని జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున తెలిపారు. 25వ అంతర్జాతీయ కాంగ్రెస్, 74వ ఐఈసీ (ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్) పేర్లతో స్థానిక ర్యాడిసన్ బ్లూ హెూటల్లో జరిగే అంతర్జాతీయ సదస్సుల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ప్రణాళికాయుత చర్యలు చేపట్టాలని సూచించారు.

నవంబర్ 2 నుంచి 8వ తేదీ వరకు జరగనున్న సంబంధిత కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. సదస్సుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరుకానున్న నేపథ్యంలో పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో పోలీసు కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఇరిగేషన్ ఈఈ ఉమేశ్ కుమార్, ఆర్డీవోలు, పోలీసు, ఎయిర్ పోర్టు అథారిటీ, అగ్నిమాపక శాఖ, ఈపీడీసీఎల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏఎంసీ పరిసరాలను శుభ్రపరచండి

జీవీఎంసీ కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో గల ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాలకు అక్టోబర్ 28న భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖర్ విశాఖ నగరానికి రానున్నందున ఆంధ్ర వైద్య కళాశాల ఆవరణ పరిసరాలను పరిశుభ్రపరచాలని జీవీఎంసీ కమిషనర్ సిఎం.సాయికాంత్ వర్మ అధికారులకు ఆదేశించారు. గురువారం ఆయన కింగ్ జార్జ్ ఆసుపత్రి ఆవరణలో గల ఆంధ్ర వైద్య కళాశాల పరిసరాలను జివిఎంసి అధికారులతో కలసి పరిశీలించారు. నగరంలో గల ఆంధ్ర వైద్య కళాశాల 1923లో స్థాపించబడి 2023 సంవత్సరం నాటికి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆంధ్ర వైద్య కళాశాల శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటుందన్నారు. కేజిహెచ్ నందు ఆంధ్ర వైద్య కళాశాల పరిసరాల నందు పరిశుభ్రత కార్యక్రమాలను, ఆ ఆవరణ రహదారిలో వ్యర్థాలను తరలించి పరిశుభ్ర పరచి, చిన్న చిన్న మరమ్మతు పనులను, పెయింటింగ్ పనులను వెంటనే పూర్తి చేసి సుందరంగా తీర్చిదిద్దాలని పర్యవేక్షక ఇంజనీర్ సత్యనారాయణ రాజుకు, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్‌కు కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాల్గవ జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏ.ఎం.ఓ.హెచ్ డాక్టర్ రాజేష్, డిఇఇ స్వాతి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డి పట్టా భూముల్లో వివాదం

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని కేశవరం రెవెన్యూ పరిధిలోని డి పట్టా భూముల్లో గురువారం వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదంలో కొంతమందికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. సుమారు 30 ఏళ్ల క్రితం కేశవరం రెవెన్యూ పరిధిలోని పేదలు సుమారు 84 మందికి ప్రభుత్వం భూములు పంపిణీ చేసింది. ప్రభుత్వం పంపిణీ చేసిన భూములు కాలక్రమేణా అమ్మకాలు జరిగి చేతులు మారాయి. ప్రస్తుతం కొనుగోలు చేసిన వారు సాగు చేసుకుంటున్నారు. అమ్మకాలు జరిగిన సమయంలో తక్కువ రేటుకు అమ్మడంతో ప్రస్తుతం రేటు పెరగడంతో అమ్మకందారులకు భూముల మాయేనంటూ భూముల్లోకి గతంలోనే వెళ్లారు. దీంతో అమ్మకాలు చేసిన వారికి కొనుగోలు చేసిన వారికి మధ్య కొంతమంది పెద్దలు సమావేశం ఏర్పాటు చేశారు. ఇరువర్గాల మధ్య చర్చలు జరిపారు. చర్చలు ఫలించకపోవడంతో భూములకు సంబంధించి ప్రభుత్వ జాబితాలో ఉన్న వారు కోర్టులో కేసు వేశారు. వివాదాలు చోటు చేసుకోవడంతో గతంలో పోలీసులు బైండోవర్ కేసులు కట్టారు. ఇదిలా ఉండగా ప్రభుత్వం మంజూరు చేసిన అసలైన లబ్ధిదారులు వారి తాలూకు కొంతమంది భూముల్లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే భూముల్లో ఉన్న కొనుగోలు చేసిన వారు, వారి తాలూకు కూలీలు మధ్య వాగ్వివాదం చోటు చేసు కుంది. ఇరువర్గాల మధ్య తోపులాటలు సంభవిం చాయి. జరుగుతున్న వివాదానికి సంబంధించి కొం దరు 100కి ఫోన్ చేశారు. తమను కొట్టి గాయ పరిచారంటూ పోలీస్‌స్టేషన్‌లో మహిళ ఫిర్యాదు చేసింది.

జీపు బోల్తా: ఒకరు మృతి

విశాలాంధ్ర - పెదబయలు: అల్లూరి జిల్లా పెదబయలు మండలం పెదకోడాపల్లి మలువు వద్ద జీపు బోల్తా పడి ఒకరు మృతి చెందగా పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. కిముడుపల్లి పంచాయితీ బంగారు మామిడి గ్రామం నుండి బయలుదేరిన జీపు చేదువుట్టు గ్రామం పులిగొంది గ్రామస్తులను గుత్తులువుట్టు సంతకు తీసుకు వెళ్తుండగా పెదకోడాపల్లి మలువు వద్ద బ్రేకులు ఫెయిల్ అయి బోల్తా పడింది. జీపులో 15 మంది ప్రయాణిస్తున్నారు. ఈ సంఘటనలో పాంగి రాజారావు అక్కడికక్కడే మృతి చెందగా ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. పాంగి కృష్ణ, పాంగి మిత్తన్న, పాంగి ప్రభాస్, పంగి సునీత, పంకి అనిల్, జి.సీతమ్మ, పి.చరిత, పి.చిన్నయ్యలు తీవ్ర గాయాల పాలయ్యారు. 108 సహాయంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై స్థానిక ఎస్సై మనోజ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అరకులోయలో స్పందన

విశాలాంధ్ర - అరకులోయ: అరకు లోయలో జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు అరకులోయ ఎంపీడీవో వెంకటేష్ తెలిపారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ స్పందన కార్యక్రమానికి జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు హాజరవుతారన్నారు. మండల ప్రజలు తమ వినతులను, అర్జీలను నేరుగా సమర్పించుకోవచ్చని తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న కలప స్వాధీనం

విశాలాంధ్ర - గొలుగొండ: కొయ్యూరు మండలం తోటలూరు గ్రామం నుండి గొలుగొండ మండలం పాత కృష్ణా దేవి పేట ఆటోలో అక్రమంగా తరలిస్తున్న టేకు కలపను కృష్ణ దేవి పేట డిప్యూటీ రేంజ్ అధికారి రాజేష్ తన సిబ్బందితో పట్టుకున్నారు. తోటలూరు నుండి కలప అక్రమ రవాణా అవుతుందని ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు మాటు వేసి టేకు మొక్కలను ఆటోను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

అంతర్రాష్ట్ర క్రీడలకు గోస్తని స్కూలు విద్యార్థి

విశాలాంధ్ర - పద్మనాభం: పద్మనాభం మండలం గోస్తని విద్యాపీట్ హైస్కూల్ కి చెందిన తొమ్మిదవ తరగతి చదువుతున్న పిల్లి అవినాష్ అంతర్రాష్ట్ర జూడో క్రీడకు ఎంపికయ్యాడని గోస్తని విద్యాపీఠం హైస్కూలు అధినేత కాళ్ల సూరిబాబు తెలియజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.పైడ్రాజు మంచి శిక్షణ ఇచ్చి మెళకువలు నేర్పి రాష్ట్రస్థాయి అండర్ 14 జూడో క్రీడకు ఎంపికయ్యే విధంగా తర్ఫీదు ఇచ్చారని అన్నారు. పిల్లి అవినాష్ తండ్రి పిల్లి ఆదినారాయణ ఒక సాధారణ ఆటో డ్రైవర్ కాగా తల్లి అప్పల రమణమ్మ గృహిణి. తమ కుమారుడు రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక కావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఎన్నికల ఎపుడు వచ్చినా నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు అన్నారు. పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈనెల 30వ తేదీన అడ్డరోడ్డులో జరిగే నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి భూత్ ఇన్‌ఛార్జిలు, గ్రామ శాఖ అధ్యక్షులు, సమన్వయ కర్తలు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, గ్రామ, మండల స్థాయి నాయకులు తరలిరావాలని కోరారు. పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగ జగదీష్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈకార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, కంకిపాటి వెంకటేశ్వరరావు, బొంది కాశీవిశ్వనాద్, దేవవరపు రాజబాబు, చించలపు ప్రదీప్, పల్లా విలియంకేరి, లెక్కల గోవిందు, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, వేములపూడి అప్పారావు, గారా ప్రసాద్, చిరుకూరి పేర్రాజు, గంపల చినరాజు, ముంజులూరి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గొడ్డేటి దేముడు వర్ధంతి

విశాలాంధ్ర - చింతపల్లి: సిపిఐ పార్టీ నేత, చింతపల్లి మాజీ శాసనసభ్యుడు స్వర్గీయ గొడ్డేటి దేముడు ఎనిమిదవ వర్ధంతి కార్యక్రమాన్ని ఆయన స్వగ్రామమైన వెలగల పాలెం లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన కుమార్తె ప్రస్తుత వైకాపా అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి, శివప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేముడు సతీమణి చెల్లాయమ్మతో కలసి మాధవి, శివ ప్రసాద్ దంపతులు, దేముడు కుటుంబ సభ్యులు ఆయన నిలువెత్తు విగ్రహానికి, అదే క్రమంలో చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు పాడేరు శాసనసభ్యురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పార్టీ శ్రేణులతో కలిసి దేవుడు విగ్రహానికి నివాళులు అర్పించడంతోపాటు వెలగలపాలెంలో ఏర్పాటుచేసిన మన్యం విప్లవ వీరుడు గాం గంటం దొర, విగ్రహాన్ని ఆవిష్కరించి ఆయనకు విప్లవ జోహార్లు అర్పించారు. ఎంపీ మాధవి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన కార్యక్రమంలో ఎంపీ

మాధవి భర్త, నేను సైతం ట్రస్ట్ ఫౌండర్ శివప్రసాద్ సహా పలువురు రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరంలో 50 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. వర్ధంతి కార్యక్రమానికి పాడేరు అరకు రంపచోడవరం శాసనసభ నియోజకవర్గాల నుంచి తరలివచ్చిన వైకాపా ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాత్రికేయులు, దేముడు అభిమానులకు మాధవి, శివ ప్రసాద్ దంపతులు 1500 గోడ గడియారాలు బహుమతిగా అందజేశారు.

ఎమ్మెల్యే సొంతూరు రోడ్డుకు మోక్షమెప్పుడో....

శంకుస్థాపన జరిగి ఆరున్నర నెలలైనా ముందుకు కదలని పనులు

విశాలాంధ్ర - పెందుర్తి: విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి జిల్లాల ప్రజల ప్రయాణపు కష్టాలు కడతేరుస్తున్నాం... వందలాది మంది వాహనదారులను ప్రమాదాల బారినుండి రక్షిస్తున్నాం... వేలాదిమంది ప్రయాణీకులకు దూరాన్ని తగ్గిస్తున్నాం.. ఇవి ఏప్రిల్ 12, 2023న వేపగుంట పినగాడి రోడ్డు శంఖుస్థాపన కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ ప్రజలకు ఇచ్చిన హామీలు. ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి 13.92 కోట్లు నిధులు విడుదల చేయించినట్లు కూడా ఆయన వెల్లడించారు. అయితే ఆ ప్రకటనలు కేవలం పత్రికలకు మాత్రమే పరిమితమయ్యాయి. రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఆరున్నర నెలలు దాటినా నిర్మాణ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు కదలలేదు. దీంతో ఈ దారిలో రోడ్డు ప్రమాదాలు ఆగలేదు.. ప్రయాణీకుల కష్టాలు కడతేరలేదు. ముఖ్యంగా పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సొంతూరు రాంపురం ప్రజల నిరీక్షణకు తెరపడలేదు. పెందుర్తి నియోజకవర్గంలో ముఖ్యమైన రహదారుల్లో వేపగుంట పినగాడి రోడ్డు కూడా ఒకటి. ఈ రోడ్డును

పాలకులు పట్టించుకోకపోవడంతో పూర్తిగా శిధిలమైంది. వాహనదారులు తరుచు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డును బాగుచేయాలని పెందుర్తి, చోడవరం, మాడుగల, పాడేరు నియోజకవర్గాల ప్రజలు చాలాకాలం నుండి కోరుతున్నారు. గత ఎన్నికల్లో ఈ రోడ్డును అభివృద్ధి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే అదీప్ రాజ్

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్యం

విశాలాంధ్ర - కె.కోటపాడు : పేదలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించి గ్రామ గ్రామాలలోని ప్రజానీకానికి అవసరమైన మందులు వైద్య

పరీక్షలు ఉచితంగా అందిస్తూ సంక్షేమం, అభివృద్ధి, ఆరోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం కొనసాగుతుందని స్థానిక జడ్పిటిసి సభ్యురాలు ఈర్లే అనురాధ అన్నారు. మండలంలోని మేడిచర్ల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ఆమె పరిశీలించారు. శిబిరాలలో ఏర్పాటు చేసిన మందులు, అంగన్వాడీ పౌష్టికాహార స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూడి నారాయణమూర్తి, ఆదిరెడ్డి వెంకటరావు, ఏటుకూరు రాజేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

గోపాలపట్నం : గ్రేటర్ విశాఖ 483 సచివాలయం పరిధిలో గల లక్ష్మీ నగర్ యూ పి హెచ్ సి హాస్పిటల్లో జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష జరిగింది. కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసరావు, 92వ వార్డ్ అధ్యక్షులు జి అప్పలస్వామి నాయుడు పాల్గొని ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాళ్ల వీర్రాజు, ఊటపల్లి గోవిందు, బండారు శ్రీనివాసరావు, జీవి రమణ, భారతి ప్రసాద్, కన్వీనర్లు, ఆర్పీలు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ: పలువురికి గాయాలు

విశాలాంధ్ర- మారేడుమిల్లి: రంపచోడవరం మారేడుమిల్లి ప్రధాన రహదారిపై గురువారం ఎదురెదురుగా కార్లు ఢీకొన్న సంఘటనలో కారులల్లో ప్రయాణిస్తున్న పలువురికి తీవ్ర

గాయాలు అయ్యాయి. రాజమండ్రి నుండి కూనవరం వైపు వెళుతున్న జియో సిబ్బంది బెల్లినో కారును కాకినాడకు చెందిన మరొక కారు ఎదురెదురుగా ఢీ కొనడంతో కాకినాడకు చెందిన అంకిత్ కాలికి తీవ్ర గాయం అయింది. అలాగే రాజమండ్రి ప్రాంతానికి చెందిన వాసు, సుధీర్‌లకు గాయాలయ్యాయి. మారేడుమిల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. 108 సిబ్బంది అంబులెన్స్ లో స్థానిక పీహెచ్సీకి తరలించి, ప్రధమ చికిత్స అనంతరం, మెరుగైన వైద్య సేవలు నిమిత్తం రంపచోడవరం ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర -యలమంచిలి రూరల్: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా గురువారం యలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో గల కోర్టుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు'లైంగిక వేధింపులు నుంచి మహిళలు, పిల్లలకు రక్షణ-సామాజిక పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు పట్టణ ఎస్సై కె.పావినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2023

విశాలాంధ్ర -విశాఖ సిటీ: జీ తెలుగు కుటుంబం అవార్డ్స్ 2023 ఘనంగా నిర్వహించినట్టు ఆ ఛానల్ ప్రతినిధి చెప్పారు. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ కార్యక్రమంలో పుట్టింటివెలుగు, ఆత్మీయపురస్కారం, జీతెలుగు చిచ్చర పిడుగు, రొమాంటిక్ కపుల్, బెస్ట్ కెమిస్ట్రీ, ఉత్తమ కోడుకు, జీ నారీశక్తి, జీ తెలుగు వెలుగు, ఉత్తమ టైటిల్ సాంగ్ తదితర విభాగాల్లో అవార్డులను ప్రదానం చేయనున్నామన్నారు. అవార్డు విజేతలు, విజేతలకు అవార్డులు అందజేయడానికి విచ్చేసిన ప్రముఖులతో కార్యక్రమం వైభవంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జీ తెలుగు కుటుంబ సభ్యులతో పాటు ప్రముఖ హీరో నాని, రామ్ గోపాల్ వర్మ, సంయుక్తా మీనన్, రేణు దేశాయ్, అనిల్ రావిపూడి, తరుణ్ భాస్కర్, అనంత్ శ్రీరామ్, సుమ-రాజీవ్ కనకాల, రఘు బాబు, పాయల్ రాజ్ పుత్, కావ్య కల్యాణ్ రామ్, అనసూయ ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరయ్యారన్నారు.

దేశ సంస్కృతిలో ఖాధీ ఒక భాగం

విశాలాంధ్ర - భీమిలి: ఖాదీ భారత దేశ సంస్కృతిలో భాగమని భారతీయుల ఆచారాలకు ఖాదీకి విడదీయరాని బంధం ఉందని డైట్ ప్రిన్సిపాల్ ఎల్ సుధాకర్ అన్నారు, గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమవుతున్న ఖాదీ మహోత్సవాలను ఆయన డైట్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి తరం ఖాదీనకు దూరమవుతున్నారని యువతరానికి ఖాదీపై మమకారం పెంచే విధంగా ప్రేరేపించాలని అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గొట్టేటి రవి మాట్లాడుతూ

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పాఠశాలలో నేటి నుంచి వ్యాస రచన వ్యకృత్వ పోటీలు పాఠశాల స్థాయిలో నిర్వహిస్తున్నారని ఆన్లైన్లో 'మై జిఓవి డాట్ ఇన్' నందు నిర్వహించబడుచున్న క్విజ్ పోటీలలో అక్టోబర్ 31 వరకు పాల్గొనవచ్చున్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు సి.ఏ. సోమయాజులు, ఎస్. త్రినాధరావు, జి రవి తదితరులు పాల్గొన్నారు

బాబుకు అండగా ఉందాం

విశాలాంధ్ర - పెదబయలు: అరకు నియోజకవర్గం పెదబయలు మండలం లక్ష్మిపేట పంచాయతీ కేంద్రంలో గురువారం తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇంచార్జి మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధినేత అధినేత కడిగిన ముత్యంలా బయటికి వస్తారని అన్నారు. చంద్రబాబునాయుడు తప్పు చేశారని వైసిపి ఆరోపిస్తే దేశం మొత్తం దాన్ని వ్యతిరేకించిందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజర్ సెక్రటరీ సాగర సుబ్బారావు, లక్ష్మిపేట మాజీ సూపర్ సర్పంచ్ నరంజి ప్రసాద్, దారెలా సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి, టీడీపీ సీనియర్ నాయకులు బత్తిరి రామారావు, మండి కిషోర్ కుమార్, కిల్లో లైకోన్, పరశురామ్, అప్పారావు, త్రినాధ్, మురళి, జవాన్, టీడీపీ యువ నాయకులు పాల్గొన్నారు.

పలు రైళ్ళు రద్దు...

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ డివిజన్‌లో పలు రైళ్లు రద్దయ్యాయి. డివిజన్ పరిధిలోని భద్రతా పనుల కారణంగా ఈ రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రద్దైన వాటిలో ప్యాసింజర్ సహా, ఉదయ్, డబల్ బల్ డెక్కర్ రైలు ఉన్నాయి. అక్టోబర్ 27, 28, 29 తేదీల్లో రాజమండ్రి - విశాఖ మధ్య నడిచే ప్యాసింజర్ రైలును (07466) పూర్తిగా రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఆయా తేదీల్లో తిరుగు ప్రయాణమయ్యే రైలు (07467) కూడా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం - విజయవాడ మధ్య ఉదయ్ ఎక్స్ ప్రెస్ పేరుతో నడిచే డబుల్ డెక్కర్ (22701) రైలును 27, 28 తేదీల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. తిరుగు ప్రయాణమయ్యే రైలు కూడా అయా తేదీల్లో అందుబాటులో ఉండదని పేర్కొన్నాయి. వీటితో పాటు 26, 27, 28 తేదీల్లో పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేసినట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. విశాఖపట్నం - కిరండూల్ (18514) నైట్ ఎక్స్ప్రెస్ కొరాపుట్ నుంచి తిరిగి ప్రయాణం అవుతుంది. అలాగే హౌరా - జగ్దల్ సామలేశ్వరి ఎక్స్ప్రెస్ టిట్లాగఢ్ నుంచి హౌరాకు తిరిగి ప్రయాణం అవుతుంది. భువనేశ్వర్-జగ్దల్పూర్ హిరా ఖండ్ ఎక్స్ప్రెస్ (18447) కొరాపుట్ నుంచి తిరిగి ప్రయాణమై భువనేశ్వర్ చేరుతుందని రైల్వే అధికారులు తెలిపారు.

మూడవ విడత భూముల రీ సర్వే వినియోగించుకోండి

విశాలాంధ్ర - రావికమతం: భూముల రీ సర్వే మూడో విడత మండలంలో ఆరు గ్రామాల్లో నిర్వహిస్తున్నామని తహశీల్దార్ మహేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టాదార్ పాస్ పుస్తకాలు, చేర్పులు మార్పులకు రెవెన్యూ కార్యాలయాలుకు రాకుండా రైతుల వ్యవసాయ భూముల వద్దకే రెవెన్యూ సిబ్బంది, సర్వే సిబ్బంది సంయుక్తకంగా విచారణ జరిపి ఖచ్చితమైన భూముల రికార్డు తయారు చేయడం ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. సాగు చేసే ప్రతి భూములు ఏ విధంగా దఖలు పడిన వివరాలు సర్వే సిబ్బందికి ఇవ్వాలని చెప్పారు. ప్రస్తుతం మండలంలో తోటకూర పాలెం, తట్టబంద, గొంప, గుడివాడ, మేడివాడ, కొత్తకోటలో రీ సర్వే కొనసాగుతుందన్నారు. అక్టోబర్ నెలాఖరకు మేడివాడ, కొత్తకోట, గొంప గ్రామాల భూముల రీ సర్వే పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఉన్నట్టు తెలిపారు.

పిల్లల్లో ప్రతిభను వెలికితీయాలి

విశాలాంధ్ర - పెందుర్తి: పిల్లల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసి అన్నివిధాలా ప్రోత్సహించాలని జీవీఎంసీ 95వ వార్డు కార్పోరేటర్ ముమ్మన దేముడు తల్లిదండ్రులకు ఉద్బోధించారు. పాపయ్యరాజుపాలెం వివేకానంద విహార్ అపార్ట్ మెంట్‌లో నివాసం ఉంటున్న గాబు కళ్యాణ్ కుమార్, రాగ ప్రియాంకల కుమారుడు 14 నెలల వయసు గల చార్విక్ ఆర్యన్ ఆన్‌లైన్ రికార్డ్ ద్వారా నోబెల్ వరల్డ్ రికార్డ్, ఇండియా వరల్డ్ రికార్డ్‌లు సొంతం చేసుకున్నాడు. జంతువులు, పక్షులు, వాహనాలు, పండ్లు, పువ్వులు, స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు, కూరగాయలు, రంగులు, వర్ణమాలలు, సంఖ్యలు, గృహోపకరణాలు, బొమ్మలు, 350 ఫ్లాష్ కార్డ్‌లను, కొన్ని జంతువుల శబ్దాలను ఏకధాటిగా గుర్తించిన చార్విక్ ఆర్యన్ విజేతగా నిలిచి నోబెల్ మెడల్ సాధించాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆ బాబును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

ఓటమి తప్పదన్న అసహనంతోనే బొత్స విమర్శలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: బొత్స అసహనంతో మాట్లాడుతున్నారని విజయనగరం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, చీపురుపల్లి నియోజకవర్గ ఇన్చార్జి కిమిడి నాగార్జున అన్నారు. గురువారం విశాఖపట్నం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్ర బాబుపై అక్రమ కేసు పెట్టారని, తెలుగుదేశం పార్టీ లేకుండా చేయాలని కుట్ర పనుతున్నారన్నారు. వైసిపి మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని, చంద్ర బాబు, భువనేశ్వరి, బ్రాహ్మణి, లోకేష్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. బొత్స మంత్రిగా పనిచేసిన అన్ని శాఖల్లో భారీగా అవినీతి చోటు చేసుకుందన్నారు. బొత్స వలన విజయనగరం జిల్లా కు, రాష్ట్రానికి ఒరిగేది ఏమీ లేదని, తోటపల్లిపై బొత్స ఎందుకు సమీక్ష చేయడం లేదని ప్రశ్నించారు.

మల్కాపురం పీఎస్ పరిధిలో ఓపెన్ హౌస్

విశాలాంధ్ర - మల్కాపురం: మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో "ఓపెన్ హౌస్ ప్రోగ్రాం" నిర్వహించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో పురస్కరించుకొని గురువారం మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో సీఐ జి.డి బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.

పోలీస్ స్టేషన్ యొక్క విధులు, విధానాలు పోలీస్ స్టేషన్ ఆవరణ అంతా చూపించి.. ఆయుధాలను కూడా చూపించి వారికి అవగాహనను కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ శ్రీహరి, ఏఎస్ఐ ఎంఎం నాయుడు, శంకర్ పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 28న జరిగే ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని వివిధ శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ డా. ఎ.మల్లిఖార్జున సూచించారు. ఆయనతో పాటు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కూడా పర్యటించనున్నారని కలెక్టర్ వెల్లడించారు. ఈ పర్యటన నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లపై స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో పోలీసు, ఇండియన్ నేవీ, ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆంధ్ర వైద్య కళాశాల ఏర్పడి వందేళ్లు పూర్తయిన నేపథ్యంలో నిర్వహించే శత వసంతాల వేడుకకు ఆయన హాజరవుతున్నారని పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. షెడ్యూల్ ప్రకారం కార్యక్రమ నిర్వహణకు అన్ని విభాగాల అధికారులు సంసిద్ధంగా ఉండాలన్నారు. ఏయూ కన్వెన్షన్ సెంటర్, ఆంధ్ర వైద్య కళాశాల పరిసరాల్లో కార్యక్రమాలు జరిగే క్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలని, ప్రత్యేక జనరేటర్లు

అందు బాటులో ఉంచుకోవాలని ఈపీడీసీఎల్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో పోలీసు కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయి కాంత్ వర్మ, జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్, ఇండియన్ నేవీ, ఎయిర్ పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు, డీఆర్వో కె.మోహన్ కుమార్ పాల్గొన్నారు.

కాఫీ, మిరియాలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - అరకులోయ: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పాడేరు మన్యం ఐటీడీఏ పరిధిలో గల అరకు కాఫీ, మిరియాలకు గిట్టుబాటు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక గిరిజన సంఘ కార్యాలయంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ మాట్లాడారు. 11 మండలాల్లో జీవనం సాగిస్తున్న ఆదివాసులు ఆర్థిక వనరు కాఫీ, మిరియాల పంటలు విస్తారంగా రైతులు సాగు చేస్తున్నారని, సుమారు 15 మెట్రిక్ టన్నులు పండిస్తున్నారని అన్నారు. పార్క్ మెంట్ కాఫీ కిలో 500, చెర్రీ కాఫీ కిలో 250, పండు కాఫీ కిలో కాఫీకి రూ 100, మంచి మిరియాలు కిలో 1000 రూపాయలు కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మిరియాల పంట సేకరణకు వ్యక్తిగత నిచ్చెనలు ప్రతి రైతుకి ఇవ్వాలని అన్నారు. కాఫీ పంట ఆరబెట్టుకునేందుకు ప్లాట్ఫారం కట్టి ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు జి.బుజ్జిబాబు, మండల నాయకులు జగనాదం, హరి, రత్నకుమారి, నానిబాబు, సిహెచ్. గురుమూర్తి పాల్గొన్నారు.

మహిళపై అత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - కోటవురట్ల: ఒంటరిగా జీవిస్తున్న మహిళపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని అనకాపల్లి జిల్లా తెలుగు మహిళా సెక్రటరీ సుకల రమణమ్మ డిమాండ్ చేశారు. కే.వెంకటాపురం గ్రామంలో మహిళపై జరిగిన అత్యాచార సంఘటనపై తెదేపా నాయకులతో కలిసి ఆమె గురువారం స్థానిక పోలీస్ స్టేషనులో ఎస్సై నారాయణరావుని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన దగ్గర్నుండి ఇప్పటి వరకు మహిళల పైన, దళితుల పైన, గిరిజన, మైనార్టీల పైన దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు జానకి శ్రీనివాస్‌రావు, పాయకరావుపేట నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు రమాకుమారి, పీవీ సూర్యరావు, తిరుమలరావు, సుంకర బాబ్జి, హరిబాబు, కోటి, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కవోని దీక్షగా కొనసాగుతున్న విజయబాబు పాదయాత్ర

విశాలాంధ్ర - యలమంచిలి రూరల్: తమ అభిమాన పార్టీ జాతీయ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేయడంతో యలమంచిలి టిడిపి నాయకులంతా తెలిపిన నిరసనలు ఒక ఎత్తైతే మాజీ ఎంపీపీ,టిడిపి జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కొలుకులూరి విజయబాబు నిరసనలు తెలుపుతున్న విధానం చాలా భిన్నంగా ఉందనే చెప్పవచ్చు. చంద్రబాబు స్కిల్ డెవలప్మెంట్ కేసులో అరెస్టు చేసిననంతరం రాష్ట్ర పార్టీ అధినాయకత్వం పిలుపు మేరకు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు, బాబుతో నేను వంటి కార్యక్రమాలు చేపట్టినప్పుడు కూడా కొలుకులూరి విజయబాబు చంద్రబాబు నాయుడు మీద ఉన్న అభిమానంతో తనదైన శైలిలో గుండెల్లో ఉన్న నిస్వార్ధమైన అభిమానాన్ని ఆరు రోజుల పాటు మౌన దీక్ష, 15రోజుల పాటూ పాదయాత్ర చేస్తున్నారు. చంద్రబాబు నాయుడుని అన్యాయంగా అరెస్ట్ చేసిన తీరును ఆయన చేసిన అభివృద్ధిని ప్రతీ ఒక్కరికి చెప్తూ అందరిలోను చంద్రబాబు నాయుడుపై అభిమానం మరింత పెరిగేలా వివరిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం తన 15వ రోజు పాదయాత్రను మండలంలో పురుషోత్తపురం, కొత్తలి నుంచి పేరంటాళ్లపాలెం వరకు సాగించారు. ఈ పాదయాత్రలో ఆయనతో పాటుగా మాజీ జెడ్పిటిసి రాజాన నారాయణమ్మ, సూర్యనారాయణ, నానాజీ, శ్రీను, సన్యాసినాయుడు, దేవుడు, అప్పలస్వామి, అప్పలనాయుడు, రాము, చిన్ని, నాయుడు, అప్పలకొండ, పెద్దబ్బాయి, సత్యనారాయణ, సముద్రాలు, సూరిబాబు పాల్గొన్నారు.

చౌడుపల్లి పంచాయతీలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర - చింతపల్లి: ఆరోగ్యమే మహాభాగ్యమని ఆలోచన చేసి ఆ దిశగా పథకాలు రూపొందించి అమలుపరిచిన, అమలుపరుస్తున్న ముఖ్యమంత్రి నాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి, నేడు అదే బాటలో నడిపిస్తున్న ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యలు అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మండలంలోని చౌడు పల్లి పంచాయతీ సచివాలయం 1లో ఎంపీడీవో ఆశాజ్యోతి, స్థానిక సర్పంచ్ గెమ్మేల లలిత ఎంపీటీసీ లువ్వాబు మీనా కుమారిల ఆధ్వర్యంలో గురువారం నిర్వహిం చారు. ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. ఆరోగ్యాన్ని మించిన ఆస్తి లేదని గ్రహించి ముందుగా ప్రతి ఒక్కరికి ఆరోగ్యాన్ని

అందించాలన్న శుభసంకల్పంతో నాడు వైయస్సార్ ఆరోగ్యశ్రీ, 108 , 104 వంటి పథకాలను తీసుకువస్తే, నేడు ఆయన తనయుడు జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకువచ్చి ప్రతి ఒక్కరికి వైద్యాన్ని చేరువ చేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రరావు, వార్డు సభ్యుడు కోరాబు కరుణానిధి, వైకాపా నాయకులు సింహాచలం, మచ్చలింగం, సచివాలయ సిబ్బంది అంగన్వాడీలు ఆశా కార్యకర్తలు వాలంటీర్లు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

మహిళలకు నిత్యావసర సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: మండలంలోని తోటవలస గ్రామంలోని నిరుపేద గిరిజన మహిళలకు మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కమ్మిడి కృష్ణకుమారి గురువారం నిత్యావసర సరుకులను పంపిణీ చేసి ఉదారత సేవాభావాన్ని చాటుకున్నారు. అనారోగ్య గిరిజనులకు వైద్యుల సహాయంతో చికిత్సలు అందించడం ఆపై చిన్నారులకు గర్భిణీలకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాలను అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల నేర నిరోధక సంఘం అల్లూరి సీతారామరాజు జిల్లా వైస్ ప్రెసిడెంట్ కె నగేష్, గ్రామ మహిళలు పాల్గొన్నారు.

సిరసపల్లిలో పొలంబడి

విశాలాంధ్ర - పెదబయలు: మండలంలో గలగండ పంచాయతీ సిరసపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి ఓ.శ్రీనివాస్ ఆదేశాల మేరకు గురువారం పొలంబడి నిర్వహించారు. ఉద్యానవన సహాయకులు జానకిరామ్ మాట్లాడుతూ వంట వేసిన పదవ వారంలో రైతులకు పొలంలో చీడపీడల నివారించుటకు గాను పద్ధతులు గురించి, ప్రత్యక్షంగా అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌విడిఎస్ సంస్థ చైర్ పర్సన్ విజయ, నీలకంఠం, మత్స్యరాజు, తదితర రైతులు పాల్గొన్నారు.

జెడ్పీ సీఈఓగా పోలినాయుడు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిషత్ నూతన ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా గురువారం ఎం.పోలినాయుడు బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జిల్లా పరిషత్ కార్యాలయంలోని పలువురు అధికారులు ఆయనకు అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో డిప్యూటీ కలెక్టర్ల బదిలీలలో భాగంగా ఆయన విశాఖ జడ్పీ సీఈవోగా ఇటీవల నియమితులయ్యారు. ఎం.పోలినాయుడు మాట్లాడుతూ విశాఖ ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ పోటీలు

విశాలాంధ్ర - రావికమతం: మహిళలు, బాలికలు పట్ల జరుగుతున్న అరాచకాలు, లైంగిక వేధింపులపై హైస్కూల్ విద్యార్థులకు పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కొత్తకోట సీఐ సయ్యద్ ఇలియాస్ మహ్మద్ మాట్లాడుతూ మహిళలు, బాలికలపై ఎక్కువగా దాడులు, లైంగిక వేధింపులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా హైస్కూల్ విద్యార్థులకు మహిళలు, బాలికలపై జరుగుతున్న లైంగిక వేధింపులు అనే అంశంపై వ్యాసరచనఏ డిబేట్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మంచి ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థులు ఎంపిక చేసి జిల్లా ఎస్పీ కార్యాలయానికి పంపిస్తామని, జిల్లా వ్యాప్తంగా పరిశీలించి మంచి ప్రతిభ వున్నవారిని ఎంపిక చేసి వారికి సర్టిఫికెట్స్, బహుమతి అందిస్తారని సీఐ తెలిపారు.

అప్పన్న ఆలయంలో అపచారం

విశాలాంధ్ర - గోపాలపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామివారి ఆలయంలో గురువారం ఉదయం అపచారం చోటు చేసుకుంది. ఉదయం గం.7 నుండి 7.30 నిల మధ్య ఆలయ ప్రాంగణంలోకి భక్తులతో పాటు శునకం ప్రవేశించిందని రెండు గంటలపాటు భక్తులకు దర్శనాలను అధికారులు నిలిపివేశారు. నీలాద్రి గుమ్మం వరకూ శునకం ప్రవేశించిందని భక్తులు అంటున్నారు. ఆలయంలో అర్చక వర్గాలు, సిబ్బంది సంప్రోక్షణ చేపట్టారు. సిబ్బంది నిర్లక్షం వల్లే వీధి కుక్క ఆలయంలోకి వచ్చిందని భక్తులు ఆరోపిస్తున్నారు.

రెల్లిలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

విశాలాంధ్ర - మకవరపాలెం: 2024 ఎన్నికల్లో రెల్లి కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించేందుకు రెల్లిలంతా పోరాటానికి సిద్ధం కావాలని కొండల అగ్రహారంలో జరిగిన సమావేశంలో రెల్లి హక్కుల సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎర్రంశెట్టి పాపారావు అన్నారు. మాకవరపాలెం మండల అధ్యక్షుడు వద్దాది దేవుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ రెల్లిలు దళితుల్లో అన్ని రంగాలలో వెనుకబడిన రెల్లిలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి ప్రత్యేక ప్రాధాన్యత ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొర్రా శ్రీనివాస్‌రావు, రెల్లి మహిళ హక్కుల సాధన కమిటీ జిల్లా అధ్యక్షురాలు కొన అరుణ రాణి, విద్యార్థి విభాగ అధ్యక్షులు దానబోయిన శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కేజీబీవీ ఉపాధ్యాయరాలు మృతి

విశాలాంధ్ర -దేవరాపల్లి: దేవరాపల్లి మండలంలో బేతపూడి కస్తూరి బాయ్ గాంధీ విద్యాలయంలో బయాలజీ లెక్చరర్ బండారు శ్రీదేవీ (35) దేవరాపల్లి ఆటో స్టాండ్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. శ్రీదేవి గత కొన్ని సంవత్స రాలుగా రైవాడ కస్తూరి బాయ్ గాంధీ విద్యాలయంలో బయా లజీ లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం అదే పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయురాలు దేవితో కలిసి దేవరాపల్లి నుండి చీడికాడలో బంధువుల గృహ ప్రవేశానికి ద్విచక్ర వాహనంపై బయలు దేరి వెళ్తుండగా దేవరాపల్లి ఆటో స్టాండ్ వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి అదుపు తప్పి ట్రాక్టర్ ట్రక్కు వెనుక భాగం ఉన్న టైర్ క్రింద పడి అక్కడిక్కడే శ్రీ దేవీ మరణించారు. ఈ ప్రమా దంలో తెలుగు ఉపాధ్యాయురాలు దేవి ప్రాణాలతో బయటపడ్డారు.

ద్విచక్ర వాహనాలు ఢీ: ముగ్గురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - హుకుంపేట: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గరు వ్యక్తులకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మం డలంలో కొట్నాపల్లి గ్రామం రైతు భరోసా కేంద్రం సమీపంలో గల వంతెన దగ్గర దుర్గం పంచాయతీ పాలమామిడి గ్రామం నుంచి వస్తున్న ద్విచక్రవాహనం మన్యం అందాలు చూసేందుకు వైజాగ్ నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. పాలమామిడి గ్రామానికి చెందిన తమర్ల వెంకట్, రంగసింగి సత్యనారాయణ హుకుం పేట వస్తున్నారు. అదే సమయంలో వంజంగి అందాలు చూసి చాపరాయి చూసేందుకు విశాఖపట్నం నుంచి వచ్చిన భరత్ తన స్నేహితులతో కొట్నాపల్లి వద్దకు రాగానే రెండు వాహనాలు ఢీ కొనటంతో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. తోటి ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించటంతో సంఘటన స్థలానికి స్థానిక ఎస్ఐ సతీష్ చేరుకొని ప్రవేట్ వాహనాల్లో పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలిం చారు. కేసు నమోదు చేస్తామని ఆయన తెలిపారు.

175 స్థానాల్లో గెలుపే వైసీపీ లక్ష్యం

విశాలాంధ్ర - అరకులోయ: రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి 175 సీట్లు గెలుపొందడం ఖాయమని అరకు లోయ సీనియర్ నాయకుడు మాజీ ఎంపిటిసి సమార్థి భాస్కరరావు తెలిపారు. మండలంలోని లోతేరు పంచాయతీ పెద్దవలస గ్రామంలో వై నాట్ 175 సీట్లుపై ర్యాలీ సమావేశం నిర్వహించారు. అనంతరం సీనియర్ నేత మాజీ ఎంపీటీసీ భాస్కరరావు మాట్లాడుతూ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని, రాబోయే ఎన్నికల్లో 175 సీట్లూ సాధించాలని, మళ్లీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కాంక్షిస్తూ అరకులోయ మండలంలోని లోతేరు పంచాయతీ పెదవలసలో చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వైఎస్సార్ సీపీ నేతలు గిరిజనులకు వివరించారు. రానున్న 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 175కి,175 స్థానాల్లో విజయం సాధించేలా మనందరం సమిష్టిగా కృషి చేయాలని ఆయ న పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అరకు నియోజకవర్గం సీనియర్ నాయకులు పాంగి చిన్నరావు, బూర్జా సుందరరావు మాజీ ఎంపిటిసి, జర్రా రఘునాథ్, తాంగుల రాందాస్, గుడివాడ ప్రకాశరావు, గొల్లోరి ప్రసాద్, వల్టాసింగి విజయ్ కుమార్ మాజీ ఉప సర్పంచ్, తదితరులు పాల్గొన్నారు.

జీతాల కోసం సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల ఎదురు చూపులు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: సమగ్ర శిక్ష అభియాన్ లో పనిచేస్తున్న అనకాపల్లి జిల్లా ఉద్యోగస్తులు సుమారు 512 మందికి మూడు నెలలుగా జీతాలు లేక అల్లాడుతున్నారని, పార్ట్ టైం ఉద్యోగులుగా సిఆర్పిలు, కంప్యూటర్ ఆపరేటర్లు, పార్ట్ టైం శిక్షకులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, ఎం ఈ ఎస్ మెసెంజర్లు, వారి జీవితాలతో విద్యాశాఖ అధికారులు జిల్లా మంత్రులు వారి జీవితాలతో ఆటలాడుతున్నారని పండగనాడు కూడా పస్తులే మిగిల్చారని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పై ఆగ్రహం వ్యక్తపరిచారు. ఇటీవల ఎస్ ఎస్ ఏ ఉద్యోగులు కుటుంబ సభ్యులతో కలిసి దసరా నాడు ఇంటిలో నుండి బయటికి వచ్చి పళ్లాలు మోగించారని పండుగనాడు కూడా ఆకలి కేకలేనని ఉద్యోగ భద్రత ఎలాగా లేదు నెలవారి జీతం కూడా ఇవ్వకుంటే ఎలా బతకాలి అని నిరసన తెలియజేయడం చూస్తుంటే వారి ఎటువంటి బాధలు పడుతున్నారో ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి ఆలోచించి తక్షణమే జీతాలు విడుదలకు ప్రభుత్వంతో మంతనాలు జరపాలని నాగ జగదీష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంటూ జీతాలకు డబ్బులు విడుదల చేయడం లేదని గత ఆగస్టులో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన 330 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాండ్ గా 40% ఇవ్వవలసి ఉండగా కేవలం 110 కోట్లు విడుదల చేయడం వల్ల మిగతా 220 కోట్లు ఇవ్వకపోవడం వల్ల జీతాలకు అంతరాయం కలుగుతుందని నాగ జగదీష్ అన్నారు. అదే విధంగా పదవి విరమణ చేసిన ఉద్యోగులకు జనరల్ ఇన్సూరెన్స్, డీఏ బకాయిలు, బిల్లులు తయారు అయ్యి ఎస్ టి ఓ గ్రీన్ ఛానల్ లో మూలుగుతున్నాయని , వీటికి మోక్షం ఎప్పుడు కలుగుతుందో చెప్పాలని రాష్ట్ర పెన్షనర్ అసోసియేషన్ కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, జిల్లా నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు.

నేచర్ స్వచ్ఛంద సంస్థ అభివృద్ధి కార్యక్రమాలపై సర్పంచులతో ముఖాముఖి

విశాలాంధ్ర - అరకులోయ: నేచర్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలపై అరకులోయ పున్నమి గోష్టి సమావేశ మందిరంలో గురువారం సర్పంచులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ ముఖా-ముఖి కార్యక్రమంలో నేచర్ సంస్థ డైరెక్టర్ ఎస్.వికాస్ బాలరాజు మాట్లాడుతూ గిరిజన వారధి అనే ప్రాజెక్టు ద్వారా అరకు మండలంలో మాదల,గన్నెల, ఇరగాయి, లోతేరు, బొండం, సుంకరమెట్ట,బస్కి మరియు దుంబ్రిగుడ మండలంలో కురిడి, సాగర, కొల్లాపూట్ కంద్రుం, అనంతగిరి మండలంలో కాశీపట్నం, నరసింహారాజపురం, కొత్తూరు, పెద్దబిడ్డ, టోకూరు, కొండిబ 18 పంచాయతీల్లో పనిచేస్తూ గ్రామస్థాయిలో ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ప్రతి కుటుంబంలో అవసరమైన ధ్రువ పత్రాలు, గ్రామస్థాయిలో సర్వేలు నిర్వహించి వాటిని గుర్తించి సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ, ఫిసా సభ్యులు,సచివాలయం వ్యవస్థ,గ్రామ వాలంటీర్లు, గ్రామ ప్రజలతో కలిసి పనిచేస్తున్నామని ఆయన తెలిపారు. మన గిరిజన ప్రాంతంలో అర్హత ఉండి కూడా ప్రభుత్వ పథకాలు పొందినవారు చాలామంది మిగిలి ఉన్నారని, అలాగే ప్రతి కుటుంబంలో ఉండాల్సిన ప్రధానమైన ఆధార్,రైస్ కార్డ్, బ్యాంక్ అకౌంట్,పాన్ కార్డ్,జాబ్ కార్డ్,ఆరోగ్యశ్రీ కార్డు లేని వారు కూడా ఉన్నారన్నారు. వీరందరికీ ఈ పత్రాలు చేయించడం ద్వారా ప్రభుత్వ పథకాలకు అర్హత కలిగి పొందడానికి పంచాయతీ మెజిస్ట్రేట్, సర్పంచులుగా తమ వంతు పాత్ర పోషించడం ఎంతైనా అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ యస్. అనీష్, అడ్మిన్ ఎం.సుభాష్, మండల కోఆర్డినేటర్లు కే బంగారు బాబు, కె.అద్దు, ఎం.ప్రసాద్ సిబ్బంది రవి, శేఖర్, తడబారికి సంతోష్, జన్ని, సింహాచలం, పద్మ, సంతోష్,శాంతి,చైతన్య, పంచాయితీ స్థాయి కమ్యూనిటీ మొబిలైజర్లు 18 మంది హాజరయ్యారు.

అమెజాన్ డాట్ ఇన్‌లో గొప్ప ఆఫర్లతో ఉత్పత్తులు

విశాలాంధ్ర -విశాఖ సిటీ: అమెజాన్ డాట్ ఇన్ లో గొప్ప ఆఫర్లు పలు ఉత్పత్తుల అందుబాటులో ఉన్నట్టు ఆ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. అమెజాన్ విస్తృత శ్రేణి వంటకాల రుచులను అందిస్తుందన్నారు. ఇంట్లోకి అవసరమయ్యే వస్తువులు మొదలుకొని ప్యాక్ చేసిన ఆహార పదార్థాలు, పానీయాలు, చాక్లెట్లు ఫిట్‌నెస్ సప్లిమెంట్ల వరకు అవసరమైన ప్రతిఒక్కటీ ఇక్కడ లభిస్తుందన్నారు. బేబీ, పెట్ కేర్ ప్రొడక్ట్స్ లేదా హెల్త్‌కేర్ అవసరాల కోసం అమెజాన్ డాట్ ఇన్ లో అందుబాటులో ఉన్నాయి అన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం

విశాలాంధ్ర-రాంబిల్లి: మండలంలో కె. డి.పాలెం గ్రామంలో గురువారం నాడు హెరిటేజ్ పాడి రైతులకు ఆ డైరీ జోనల్ మేనేజర్ వి.దివాకర్రావు నూతన పాల సేకరణ కేంద్రాన్ని, ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించారు. హెరిటేజ్ డైరీలో పాలు పోసిన రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డైరీ పాడి రైతుల పశువుల కృత్రిమ గర్భధారణ 50 రూపాయలకు అందిస్తున్నామని అంతేకాకుండా ఆడ పెయ్య పుట్టడం కోసం 500 రూపాయలకే కృత్రిమ గర్భ ధారణ అందిస్తామన్నారు. హెరిటేజ్ డైరీ రీజనల్ మేనేజర్ పి.నాగ అప్పారావు మాట్లాడుతూ తానెప్పుడూ రైతులకు అందుబాటులో ఉంటానన్నారు. అనంతరం గ్రామంలో గల 42 పాడిపశువులకు డి వార్మింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో డైరీ మ్యానేజర్ కూండ్రపు శేషు, డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, పాడి రైతులు పి.శివరాము, బి.రాజు, ఎ.లక్ష్మీ, ఎస్.దుర్గమ్మ, ఆర్.కృష్ణవేణి, ఆర్.సింహాచలం, ఎన్.రాజబాబు పాల్గొన్నారు.

ఆదివాసీ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్డ్‌లో చేర్చాలి

విశాలాంధ్ర - వి. మాడుగుల: అనకాపల్లి జిల్లాలోని ఆదివాసీ గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని మాడుగుల మండలంలో శంకరం పంచాయతీలో బోడ్రెవు గ్రామంలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.భవానీ, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ గిరిజన సంఘం నాన్ షెడ్యూల్ ఏరియా జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.నరసింహమూర్తి మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో ఉన్న నాన్ షెడ్యూల్ ఆదివాసి గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని గ్రామ సభలో పెట్టి తీర్మానాలు చేయడం జరిగిందని, తీర్మానాలు చేసినటువంటి గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్డ్‌లో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవదాసు నాగార్జున, బాలకృష్ణ, విజయశాంతి, పాలమ్మ, చిన్నారావు, గిరిజనులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్ష శిబిరాలకే పరిమితమా ...

విశాలాంధ్ర - మధురవాడ: 7వవార్డు పరిధి అల్లూరి సీతారామరాజు నగర్, వైయస్సార్ నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. అక్కడ రోగులకు అన్ని వైద్యసేవలూ అందిచారు. ఆదే సమయంలో పలు వైయస్సార్ నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల తో పాటు పూర్తి స్థాయి సిబ్బంది అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. దీనితో పేదల ఆరోగ్య పరిరక్షణకు ఏర్పాటు చేసిన ఆరోగ్య సురక్ష శిబిరాలకే పరిమితమా అన్న అనుమానానికి తావిస్తోంది. 7వ వార్డు టియ్సార్ నగర్ లో ఆరోగ్య సురక్ష ప్రత్యేక శిబిరం జరుగుతున్న సమయంలో మధ్యాన్నం వొంటిగంట ప్రాంతంలో విశాలాంధ్ర ప్రతినిధి 5వ వార్డు మారికవలస రాజీవ్ గృహకల్ప కోలనీ లో గల వైయస్సార్ నగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రా నికి వెళ్ళారు. అక్కడ డాక్టర్ చైతన్య లేరు.సిస్టర్స్ ఇద్దరిలో వొక్కరు ఆర్.నారీమణి మాత్రమే వున్నారు. అదీ సివిల్ డ్రెస్ లో,.ఫార్మసిస్ట్, లాబ్ టెక్నీషియన్ తోపాటు డేటా ఎంట్రీ శ్యామ్సుందర్ మాత్రమే వున్నారు. వారు పూర్తి సమాచారం ఇవ్వలేకపోయారు. అప్పటికి 41మంది రోగులు వచ్చారు.ఈ వైయస్సార్ ప్రాథమిక కేంద్రాల పై పర్యవేక్షణ పెంచి,అవి పనిచేసే ఉ.9నుండి సా.5 గం.లవరకు సేవలు అందేలా ఛర్యలు చేపట్టి పేదల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యాన్ని సాకారం చెయ్యవలసిన అవసరాన్ని గుర్తించాలి.

నిజం గెలవాలి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



విశాలాంధ్ర - ముంచంగి పుట్టు: మండల పరిధిలో గల కర్రిముఖిపుట్టు పంచాయతీ కేంద్రంలో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా నారా భువనేశ్వరి చేపడుతున్న నిజం గెలవాలి అనే కార్యక్రమం విజయవంతం కావాలని తెలుగుదేశం పార్టీ నాయకులు ఆధ్వర్యంలో కర్రిముక్కిపుట్ గ్రామంలో గల దుర్గమాత ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరకు పార్లమెంట్ ఆర్గనైజర్ సెక్రటరీ పాంగి శాస్త్రిబాబు మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు చేసి నిర్బంధించడంతో బాధతో మృతి చెందిన వారి కుటుంబానికి పరామర్శించడానికి నిజం గెలవాలి అంటూ ముందుకొస్తున్న భువనేశ్వరి అమ్మకు ప్రజలందరు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు నీలకంఠం పాత్రో, సీబీన్ యువ నాయకులు సుబ్రహ్మణ్యం, నాగేష్, రఘు, యువగలం నాయకులు సూర్యనారాయణ, గంగాధర్, నరేష్, పార్టీ సీనియర్ నాయకులు కిముడు రామదాసు, కొచ్చో రామదాసు, మత్యరాజు, త్రినాధ్, రాము, ధనుంజయ, గురు మూర్తి, చిరంజీవి, బాబూజీ, లోకేష్, గోపాల్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

చాపరాయిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: చాప రాయి జల తరంగిణి పర్యాటకులకు మరింత ఆకర్ష ప్రాంతంగా తీర్చిదిద్దాలని సంబంధిత అధికారులకు పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదేశించారు. మండలంలో గల చాప్రాయి జల తరంగిణీ గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాపురాయి జలపాతాన్ని సందర్శించే పర్యటకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండడంతోపాటు చాపు రాయిని సుందరంగా తీర్చిదిద్దాలని సంబంధిత ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట స్థానిక తాసిల్దార్ నాగమ్మ ఎంపీడీవో ఉషారాణి స్థానిక ఎస్సై సంతోష్ కుమార్ ట్రైబల్ హెల్పర్ అసిస్టెంట్ ఇంజనీర్ అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

దర్జాగా భూ కబ్జాలకు పాల్పడుతున్న దొరబాబులు

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం, పరిసర ప్రాంతాల్లో స్థానిక రెవెన్యూ అధికారులు, అధికార పార్టీ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మ శ్రీ అండదండలతో వై.సి.పి దొరబాబులు యధేచ్ఛగా భూ ఖబ్జాలకు, దందాలకు పాల్పడుతున్నారు అని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు రెడ్డిపల్లి అప్పల రాజు ఆరోపించారు. చోడవరం - లక్ష్మీపురం రోడ్డులో అటవీ శాఖ పూర్వపు వెదురు డిపో ఎదురుగా కొందరు బడాబాబులు, రియల్టర్లు కొనుగోలు చేసిన భూమిలో కలసిన చోడవరం రెవెన్యూ సర్వే నెంబర్ 11 లో కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని దర్జాగా ఖబ్జా చేసి, ప్రభుత్వ వాల్టా చట్టాలను ధిక్కరించి, భారీ వృక్షాలను నరికి వేసి, వాటిల్లో ప్లాట్లు వేసి దర్జాగా అమ్మకాలు కొనసాగిస్తున్నారన్నారు. నియోజకవర్గంలో వై.సి.పి. నేతలు ఖబ్జా చేసిన చోట జగనన్న భూ రక్షణ క్రింద రీ సర్వే జరపకుండా అడుగడుగునా అధికార పార్టీ నేతలే అడ్డు పడుతున్నారని అధికారులు ఆరోపిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ భూముల ఖబ్జాల్లో స్థానిక ఎమ్మెల్యే, వారి సోదరుల హస్తం వుందని బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయిని తెలియ జేశారు. అధికార వై.సి.పి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల పథకంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వ భూమి లేదంటున్న రెవెన్యూ అధికారులు, "ధర్మం" గాడి తప్పుతూ భూ ఖబ్జాలు, ధందాలకు పాల్పడుతున్న దొరబాబులకు ఏ విధంగా సహకరిస్తున్నారు అని ప్రశ్నిస్తున్నారు. చోడవరం చుట్టుపక్కల వై.సి.పి. దొరల ఖాబ్జాలు, దందా లతో పేదలు, బడుగు బలహీనవర్గాల ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. దీనిపై జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి, జగనన్న భూ రక్షణ క్రింద రీ సర్వే జరిపి, ఖబ్జా దారుల నుండి విలువైన ప్రభుత్వ భూములు కాపాడి, ప్రజా ప్రయోజనాలకు వినియోగించ వలసిందిగా భారత కమ్యూనిస్ట్ పార్టీ, స్థానిక మహిళా, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. లేదంటే పేదల పక్షాన మరో భూ పోరాటం తప్పదని రెడ్డిపల్లి హెచ్చరించారు.

దీనస్థితిలో ఉన్న రైతాంగాన్ని ఆదుకోవాలి

విశాలాంధ్ర - కశింకోట: అనకాపల్లి జిల్లాలో రైతాంగం దీనస్థితిలో ఉందని వర్షాభావ పరిస్థితుల వల్ల వర్షాలు లేక నాట్లు వేసిన వరి పొలాలు ఎండ తీవ్రతకు తీవ్రంగా ఎండిపోయి గడ్డికి కూడా పనికిరాకుండా ఉన్నాయని ఈ పరిస్థితుల్లో రైతులను ఆదుకోవాల్సిన వైసీపీ ప్రభుత్వం జిల్లా మంత్రులు కనీసం మాట్లాడటం లేదని, అనకాపల్లి జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని అచ్చుత పురం గ్రామంలో పంట పొలాలను పార్టీ నాయకులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,36,460 ఎకరాలకు గాను 1, లక్ష 06, వేల ఎకరాల్లో పంట నమోదయిందని సెప్టెంబర్ 30 నాటికి పంట సాగు నమోద చేసిన 78 శాతానికి మించి సాగలేదని, పాయకరావుపేట, నక్కపల్లి, రాంబిల్లి మండలాల్లో సాధారణ విస్తీర్ణంలో సాగు సగం కూడా పంట నమోద కాలేదని తెలిపారు. వర్షాలు లేక వేసిన పంటలు ఎండిపోతున్నాయని, జూన్ 1 నుండి సెప్టెంబర్ 30 వరకు 694.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 609.5 మిల్లీమీటర్ల కురిసిందని, చాలా చోట్ల వర్షపాతం లోటు ఉందని రమణమూర్తి తెలిపారు. పరవాడ, అనకాపల్లి, మాకవరపాలెం, మునగపాక, అచ్యుతాపురం, యలమంచిలి, నక్కపల్లి, పాయకరావుపేట, ఎస్ రాయవరం, రాంబిల్లి మండలాలలో వర్షపాతం లోటు ఉందని రమణమూర్తి అన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాలెం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉల్లింగల రమేష్, చింతలపాలెం మాజీ సర్పంచ్ కర్రి దుర్గునాయుడు, కసింకోట మండల తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గంటా యువసేన కన్వీనర్ జెర్రిపోతుల నూకు నాయుడు, నారిపిల్లి ప్రసాద్ వైస్ ప్రెసిడెంట్ బల్ల అప్పల కొండ, తెరపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించడమే లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో పదికి పది గ్రేడ్ పాయింట్లు సాధించడమే లక్ష్యంగా క్రమ శిక్షణతో విద్యార్థులు చదువుకోవాలని ఐటిడిఏ పీఓ వి.అభిషేక్ అన్నారు. జీవితంలో ఎదగడానికి ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. బాగా చదువుకుని ఐటిడిఏ కు గిరిజన ప్రాంతానికి మంచి పేరు తీసుకుని రావాలన్నారు. గుత్తులపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల, దిగుమోదా పుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో సూపర్ 50 చదుపే వెలుగు కింద ఎంపిక చేసిన 52 మంది పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధనా తరగతులను ' గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తలిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ గుత్తుల పుట్టు ఆశ్రమ పాఠశాలలో 32 మంది బాలికలకు, దిగుమోదా పుట్టు ఆశ్రమ పాఠశాలలో 20 మంది బాలురకు ప్రత్యేక బోధనా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ విద్యార్థికి 20 నోటు పుస్తకాలను పంపిణీ చేసారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, డా. బి. ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఎటిడబ్ల్యూ ఎల్.రజని, ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి, గంగా భవాని, మంజుల, ఆర్. దర్మన్న, రీమిలి జాన్, ప్రసాద్, శ్రీనివాస పడాల్ పాల్గొన్నారు.

అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జిల్లాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదైందని వెంటనే అనకాపల్లి జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని మాజీ శాసనసభ్యులు నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ డిమాండ్ చేశారు.పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. జిల్లాలోని 16 మండలాలలో తీవ్ర కరువు ఏర్పడితే వైకాపా మంత్రులు, ఎమ్మెల్యేలు ఏం చేస్తున్నారు అని ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వంలో రైతులు వ్యవసాయానికి దూరం అవుతున్నారని ఆరోపించారు. జిల్లాలో గత ఏడాధి కంటే ఈ కరిఫ్ సీజన్ లో 52 శాతం లోటు వర్షపాతం నమోదు అయ్యిందని అన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో అనకాపల్లి మండలం 34.1 శాతం , కశింకోట మండలంలో 50.2 శాతం లోటు వర్షపాతం నమోదు అవ్వడంతో రెండు మండలాలలోని వేలాది ఎకరాలలో వరి పంట ఎండిపోయిందన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆయన వరి నారులతో నిరసన తెలియజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టికి వినతి పత్రం అందజేశారు. వారికి ఎండిన వరి నారులను చూపించారు. కశింకోట మండలంలో ఏకంగా 60 శాతం పంటలు దెబ్బతింటున్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మండలానికి 10కోట్ల రూపాయిల కరువు నిధిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మళ్ళ సురేంద్ర, పచ్చికూర రాము, తలారి కాశీ నాయుడు, నంబారి శ్రీను, మధుపాడ నరసింగరావు, పోలారపు త్రినాథ్, బోద్దపు ప్రసాద్, చీకటి రాంబాబు,దాడి పేంటా రావు, అక్కిరెడ్డి రమణ బాబు, నూక రాజు, బాలాజీ, దాడి నాగేశ్వరావు, బాబు రావు, తదితరులు పాల్గొన్నారు.

పటక దవడ గ్రామానికి రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరు

విశాలాంధ్ర - హుకుంపేట: మండలం మారుమూల ప్రాంతమైన బూర్జ పంచాయతీ పటక దవడ గ్రామానికి రహదారి సదుపాయం కల్పించాలని అల్లూరి జిల్లా కలెక్టర్‌కు బుర్జ ఎంపిటిసి మజ్జి హరి స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుకు స్పందించిన జిల్లా కలెక్టర్ రహదారి నిర్మాణానికి ప్రత్యేక నిధులను కేటాయిస్తున్నట్లు ఇంజనీరింగ్ శాఖకు ఆదేశించారని అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో ఎంపిటిసి మాట్లాడుతూ ఇంజనీరింగ్ అధికారుల తో కలిసి బూర్జ గ్రామం నుండి, జాక రవలస, తుంబవలస మీదుగా పటక దవడ గ్రామానికి రహదారి కల్పించడానికి సుమారు 8 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి కొలతలు తీసుకోవడం జరిగిందని ఎంపిటిసి తెలిపారు. ఈ రహదారి నిర్మాణం చేయడం వలన ఎన్నో ఏళ్ల నుండి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న పటకదాడ గ్రామం అభివృద్ధి చెందుతుందని ఆయన ఆశ భావం వ్యక్తం చేశారు.

ఆయుర్వేద శాండల్ గ్లో సోప్‌ను విడుదల చేసిన హిమాలయ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: భారతదేశంలోని ప్రముఖ వెల్‌నెస్ బ్రాండ్‌లలో ఒకటైన హిమాలయ వెల్‌నెస్ కంపెనీ, చందనాది రోపనా తైలాన్ని కలిగిన తన కొత్త ఆయుర్వేద శాండల్ గ్లో సోప్‌ను విడుదల చేసింది. ఈ సంప్రదాయక ఆయుర్వేద తైలం మన చర్మానికి అత్యంత ప్రత్యేకమైన పదార్థాలలో ఒకటి కాగా, స్వచ్ఛమైన గంధం చర్మాన్ని మృదువుగా చేయడానికి మరియు మెరుపును పెంచేందుకు సహకరిస్తుందని హిమాలయ కంపెనీ డివిజన్ జనరల్ మేనేజర్ సుశీల్ గోస్వామి చెప్పారు.

వారపు సంతల్లో కాఫీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు



విశాలాంధ్ర - దుంబ్రిగూడ: దళారి వ్యవస్థను నిర్మూ లించడంలో భాగంగా వారపు సంతల్లో జిసిసి కాటాలను ఏర్పాటు చేసి కాఫీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అరకు గిరిజన సహకార సంస్థ బ్రాంచ్ మేనేజర్ వి శ్రీనివాసరావు తెలిపారు. దేశ విదేశాల్లో అరకు కాఫీ కు మంచి ఆదరణ ఉందని ఆయన చెప్పారు. అయితే కాఫీ సాగుదారులకు దళారులు సరైన గిట్టుబాటు అందించకుండా కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో దళారి వ్యవస్థను నిర్మూలించేందుకుగాను ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ తరుణంలో బ్రాంచి పరిధిలో గల వివిధ గ్రామాల్లో జరిగే వారపు సంతల్లో జిసిసి కాటాల ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించి పర్చమెంట్ కాఫీ ఒక కిలో కు 280 తో కొనుగోలు చేయగా చెర్రీ 145, అలాగే రోబుస్త చెర్రీ కాఫీ కు 70 చెల్లిస్తూ కొనుగోలు చేస్తామని ఆయన వివరించారు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి

విశాలాంధ్ర - కోటవురట్ల: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మండల తెదేపా అధ్యక్షులు జానకి శ్రీనివాసరావు అన్నారు. గురువారం తన స్వగృహంలో మండల తెదేపా నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్త గ్రామాల్లో తిరిగి చంద్రబాబు అమలు చేయబోయే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. ఓటర్ల లిస్టు పరిశీలన చేసి తొలగించిన వారి వివరాలతో మరల ఓటు నమోదు కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెదేపా సీనియర్ నాయకులు జనార్దన్, పివి సూర్యారావు, చంటి, తిరుమలరావు, సుంకర బాబ్జి, బొడ్డేటి వెంకటరమణ, జానకి హరిబాబు పాల్గొన్నారు.

బైకు దగ్ధం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

విశాలాంధ్ర - హుకుంపేట: మండల కేంద్రానికి అత్యంత సమీప గ్రామమైన డీ చింతలవీధిలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ద్విచ క్రవాహనాన్ని దగ్ధం చేశారు. డీ.చింతలవీధి గ్రామానికి చెందిన పాంగి కామరాజు తన పల్సర్ బైకును యధావిధిగా తమ ఇంటి వద్దనే పెట్టానని అయితే బుధవారం రాత్రి ఎవరో గుర్తు తెలియని వ్యక్తుల దగ్ధం చేశారని ఆయన తెలిపారు. తనపై కక్ష సాధించేందుకే ఈ విధంగా బైకును దగ్ధం చేశారని దీనిపై పోలీసుకులు ఫిర్యాదు చేశామని ఆయన పేర్కొన్నారు.

కాగడాలతో టీడీపీ నిరసన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ కాగడాలతో 75వ వార్డు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. 75వ వార్డు కార్పొరేటర్, తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యములో గత 40 రోజులుగా రిలే నిరాహారదీక్షలు చేపట్టడం జరిగింది. 75వ వార్డు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో కాగడాలు వెలిగించి తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మిబాయి, 75వ వార్డు అధ్యక్ష కార్యదర్శులు నమ్మి అప్పారావు, దొమ్మేటి పెరుమాళ్, శ్రీమురిసీ శ్రీనివాస రావు, గోక్యాడ ముత్యాలు, అండి బోయిన రాము నాయుడు, పెద్దాడ సోము నాయుడు, నంబారు సింహాద్రి భొంగు రాజు,, మొల్లి అప్పల నాయుడు ముద్దార్తి సొంబ శివరావు తదితరులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద ఘటనలో వ్యక్తికి జైలు శిక్ష

విశాలాంధ్ర - ఆనందపురం: 2019లో జరిగిన బస్సు యాక్సిడెంట్‌కు సంబంధించి ఒక సంవత్సరం జైలు శిక్ష 5000 జరిమానాలను 15వ అదనపు మెట్రో పాలిటన్ కోర్టు భీమిలి జడ్జి శిక్ష విధించడం జరిగింది. వివరాల్లోకెళ్తే పెందుర్తి ప్రాంతానికి చెందినటువంటి ఆర్టీసీ డ్రైవర్ కరాట శ్రీనువాసరావు 2019 జనవరిలో విజయనగరం టూ సింహాచలం బస్సు సింహాచలం వైపు నడుపుతుండగా రాలి పైడమ్మ (60) పద్మనాభ మండలం గ్రామానికి చెందినటువంటి ఆమె ప్రమాదానికి గురైంది. ప్రమాదంలోనే సంఘటనా స్థలంలోనే మృతి కావడంతో అయితే అప్పటినుంచి ఇప్పటివరకు కేసు నడవగా ఈరోజు అనగా 26 10 23 కోర్టు వారు ఆమె మృతికి కారణమైనటువంటి కరక శ్రీనివాసరావు 40కి ఒక ఏడాది జైలు శిక్ష 5000 జరిమానా విధించినట్లుగా ఆనందపురం సిఐ రామచంద్ర రావు వెల్లడించారు.

అవార్డు ఎంక్వైరీ గ్రామ సభ



విశాలాంధ్ర - వి.ఆర్.పురం: మండలంలోని వడ్డిగూడెం పంచాయతీ పరిధిలో గల ధర్మతాళ్ళ గూడెం గ్రామం నందు పోలవరం ప్రాజెక్టు కారణంగా నిర్వాసితులవుతున్నటువంటి గ్రామ ప్రజలకు పోలవరం అథారిటీ కమిటీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీపతి, స్పెషల్ డిప్యూటీ తాసిల్దార్ ఎన్ శ్రీధర్, డిటిఎస్ చిరంజీవి ఆధ్వర్యంలో గురువారం అవార్డు ఎంక్వయిరీ ద్వారా ప్రతి కుటుంబం నుంచి ఇంటి పన్ను రసీదు ఆధార్ కార్డు ఇంటి పట్టా రేషన్ కార్డు బ్యాంక్ అకౌంట్ ఇంటి యజమాని ఫోటో లేదా కుటుంబ ఫోటో కరెంట్ బిల్లు ఓటర్ ఐడెంటి కార్డు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో 1753 కుటుంబాలకు గాను 1715 కుటుంబాలకు అవార్డు ఎంక్వయిరీ నోటీసు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి వాళ్ళ రంగారెడ్డి, సర్పంచ్ ఎస్ నరసమ్మ, ఉప సర్పంచ్ శ్రీనివాస్, సెక్రటరీవి ఎస్.రెడ్డి, ఆర్ఐ రామ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ ఇష్యూకు ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

విశాలాంధ్ర/విశాఖపట్నం: ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (గతంలో కేకేఆర్ ఇండియా ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ అని పిలిచేవారు) పబ్లిక్ ఇష్యూ కోసం అక్టోబర్ 11, 2023న ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసినట్లు ఇన్‌క్రెడ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ హెరాల్ టైమ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ భూపిందర్ సింగ్ తెలిపారు. ఒక్కొక్కటి రూ.వెయ్యి ముఖ విలువ కలిగిన లిస్టెడ్, రీడీమ్ చేయదగిన, కన్వర్టబుల్ కాని డిబెంచర్లు ఉన్నాయన్నారు. ఇష్యూ బుధవారం, అక్టోబర్ 25, 2023న తెరిచినట్లు చెప్పారు. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్‌కు అనుగుణంగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు లేదా ఫైనాన్స్ కమిటీ నిర్ణయించిన విధంగా ముందస్తుగా మూసివేయడం లేదా పొడిగింపు ఎంపికతో నవంబర్ 7, 2023 మంగళవారం ముగుస్తుందని తెలిపారు. రూ. 300 కోట్ల వరకు సురక్షిత ఎన్సీడీల కోసం ఈ ఇష్యూ అన్నారు.